క్లుప్తంగా

నూతన వంగడాలపై దృష్టి సారించాలి



కొత్తరకం పత్తి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: పత్తి సాగు రైతులు నూతన వంగడాలపై దృష్టి సారించాలని కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి సూచించారు. శుక్రవారం సి.బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామంలోని ఆర్బీకేలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడీఏతో పాటు నంద్యాల ఆర్ఏఆర్ఎస్ఏ శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మికల్యాణి, లావణ్యల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు మెలకువలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా సాగు చేపట్టాలని సూచించారు. రైతులకు కొత్త రకం పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. సాగులో పాటించాలని పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు.

పాణ్యం ఎస్ఐగా అశోక్

పాణ్యం: పాణ్యం మండల ఎస్ఐగా అశోక్‌ను బదిలీ చేశారు. పాణ్యం ఎస్ఐగా పని చేస్తున్న పి. సుధాకర్‌రెడ్డి బదిలీపై డోన్ రూరల్‌కు వెళ్లారు. నంద్యాల డీఎస్బీ అటాచ్ డీసీఆర్‌బీలో పని చేస్తున్న అశోక్‌ను ఉన్నతాధికారులు పాణ్యం స్టేషన్‌కు బదిలీ చేశారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



రైతుకు కౌలుకార్డు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర సేవలు అందిస్తున్నట్లు ఎంపీపీ ఉసేనమ్మ అన్నారు. శుక్రవారం పాణ్యంలోని సచివాలయం-4లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వంలో ఇంతలా సత్వర సేవలు అందలేదన్నారు. అనంతరం ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుండి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యామ్‌లో 0.954 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

కల్లూరు: ఉపాధి పనులు వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లె మజార గ్రామం ఒబులాపురం తండా, ఉలిందకొండ గ్రామ మజార గ్రామం కొల్లంపల్లి తండా గ్రామాల్లో ప్రజలతో సమావేశమై ఉపాధి హామి పథకం, ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఎందుకు అందరూ పని రోజులను వినియోగించుకోవడం లేదని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు దినసరి వేతనం తక్కువగా వస్తుందని పీడీకి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఎర్రమల, ఈసీ మధుసూదన్‌రావు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మరమ్మతు పనులను పరిశీలించిన సీఈ



కట్టను పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయ కట్ట కుంగిన ప్రదేశంలో చేపడుతున్న మరమ్మత్తులను శుక్రవారం సీఈ కబీర్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి శాశ్వితంగా నిలిచిపోయేలా చేయాలన్నారు. అలాగే కుంగిన కట్ట ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ సుభకుమార్, డీఈఈలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఆర్ కొంతలపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారురాలికి కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సాంకేతిక సమస్యలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించడంతోపాటు 11 రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. కర్నూలు మండలం ఆర్ కొంతలపాడు, తొలిశాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూలబొకేలు, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సర్టిఫికెట్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ప్రజల చెంతకే వచ్చాయని చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేయాలన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆర్ కొంతలపాడులో 240 మందికి, తొలిశాపురంలో 60 మందికి కుల, ఆదాయ, ఆధార్‌కార్డు, మ్యారేజ్ సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, సచివాలయ కన్వీనర్లు మద్దిలేటి, వసంత్, మధు, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం



బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని భైరాపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసానితో పాటు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అవ్వా, తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ, గత నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే కాటసాని ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి...ఏమవ్వా పింఛన్ వస్తోందా? అని ఆరా తీశారు. అందుకు వృద్ధురాలు వస్తోంది నాయనా.. కాకపోతే అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పగా తక్షణమే ఉల్లిందకొండ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి, మందులు ఇప్పించాలని సచివాలయ ఏఎన్ఎంను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేశామని, త్వరలోనే పనులు మొదలు పెట్టిస్తామని హామిచ్చారు. ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని, ఓట్ల కోసం మాటలు చెప్పే టీడీపీ నాయకుల మాటలను నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఏఈలు రామసుబ్బారెడ్డి, రామయ్య, సచివాలయ మండల కన్వీనర్ లోటర్‌బాష, గ్రామ నాయకులు పరమేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, లొద్దిపల్లె నాగేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా పాటించండి

● పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలను పరిశీలించిన ఫుడ్ కమిషన్ చెర్మన్



బీసీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న చెర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

పాణ్యం: ప్రతి పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని, అక్రమాలకు పాల్పడితే సహించబోమని ఏపీ ఫుడ్‌కమిషన్ చెర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బీసీ బాలికల, గిరిజన గురుకుల, చెంచుకాలనీలోని ఆశ్రమ పాఠశాల, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, సుగాలిమెట్ట వద్ద ఉన్న కస్తూర్బా, ఏపీ మోడల్‌స్కూల్, తమ్మరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. పౌష్టికాహారం, పాలు, గుడ్లు, చిక్కీలు, గర్భిణులకు అందజేస్తున్న ఆహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సురేష్, డీఎస్ఓ జగన్‌మోహన్ రావు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ అధికారులు చింతామణి, లక్ష్మీదేవి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఐఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంఈఓ కోటయ్య, ఐసీడీసీ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



వర్క్యారు సచివాలయంలో జగనన్న సురక్షపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకెంతో మేలు జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వర్క్యారు, గోరంట్ల, లద్దగిరి గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డిలు పరిశీలించి సచివాలయ సిబ్బంది, వలంటరీలకు పలు సూచనలిచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన 11రకాల సర్వీసులను ప్రజలు ఉచితంగా పొందవచ్చునన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు



కోడుమూరులో లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న కామేశ్వర ప్రసాద్

కోడుమూరు రూరల్/ గోనెగండ్ల: కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని లెప్రసీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కోడుమూరులో జరుగుతున్న లెప్రసీ సర్వేను ఆయన పరిశీలించారు. లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ భాస్కర్‌తో కలిసి గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. జూన్ 26 నుంచి జూలై 16 వరకు అంటు వ్యాధుల(సీడీఎస్‌సీడీ)పై జిల్లాలో సర్వేలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,77,202 మందిని పరీక్షించగా..628 మందికి అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించారన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సి.బెళగల్: మండల పరిధిలోని తుంగభద్రా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఐ పీరయ్య తెలిపారు. సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్ఐ సిబ్బందితో కలిసి సంగాల, తిమ్మందొడ్డి గ్రామాలలో గస్తీ నిర్వహించారు. చింతమానుపల్లె, సి.బెళగల్ గ్రామాలకు చెందిన రెండు ట్రాక్టర్లు ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ ట్రాక్టర్లు చింతమానుపల్లెకున బోయ రామకృష్ణ, సి.బెళగల్‌కు చెందిన బెస్త సుధాకర్‌కు చెందినవి అని ఎస్ఐ వివరించారు. ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

పాణ్యం: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ అన్నారు. గురువారం గోనవరం గ్రామంలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భా వ దినోత్సవం సందర్భంగా జెండా ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ 28సంవత్సరాలుగా వర్గీకరణ కోసం మందక్రిష్ణ మాదిగ ఉద్యమాలు చేపడుతూనే ఉన్నారన్నారు. మందకృష్ణ పోరాట ఫలితంగా కుల సంఘాలు చైతన్యమయ్యాయని, హక్కుల కోసం ఉద్యమిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఓర్వకల్లు: ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సంటర్(సీహెచ్‌సీ)ని ఆయన సందర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల రికార్డులు, ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ రిజిస్టర్‌ను పరిశీలించి, ల్యాబ్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తం తక్కువగా వున్న గర్భవతులకు జాగ్రత్తంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్.మంజుల, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాడు -నేడు పనులను వేగవంతం చేయండి

గడివేముల: ప్రభుత్వపాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొరటమద్ది ఎంపీయూపీ పాఠశాల, గడివేముల జెడ్పీస్కూల్, మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పదోతరగతి స్టడీ అవర్స్‌ను పరిశీలించి సూచనలు చేశారు. అలాగే కస్తూర్బాలో జరుగుతున్న నాడు-నేడు పనుల పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయం-1లో 14 గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 విమాలా వసుంధరదేవి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ,కస్తూరిబా ఎస్ఓ రుబీనా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మిస్సింగ్‌పై కేసు నమోదు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ వ్యక్తి మిస్సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు. కటిక రంజాన్ (31) ఈనెల ఒకటవ తేదీ ఉదయం కర్నూలు వెళ్తున్నాని చెప్పి ఇంటికి రాకపోవడంతో భార్య ఖాజాబీ ఫిర్యాదు మేరకు శుక్రవారం వ్యక్తి మిస్సింగ్‌పై కేసు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుడదు

పాణ్యం: విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఎక్కడ ఒత్తిడికి గురికాకుడదని, ఆలోచించి పరిష్కారించుకోవాలని ప్రముఖ హాస్య నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, గెస్ట్ ఫ్యాకల్టీ గుండు సుదర్శన్ అన్నారు. శుక్రవారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు ''పర్సనల్ ఎఫెక్ట్యూనెస్ ఫర్ కెరీయర్ సక్సెస్ '' అంశంపై రెండు రోజులుగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం ఆయనను కళాశాల డీన్ ఆశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి సన్మానం చేశారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి

సి.బెళగల్: ప్రభుత్వ భవన నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ మద్దమన్న సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, కర్నూల్ పీఆర్ డీఈ మహేశ్వరరెడ్డితో కలిసి కాంట్రాక్టర్లు, సచివాలయ ఇంజినీర్ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల నిర్మాణాలకు గతంలో ఉన్న రూ.40 లక్షలకు అధనంగా మరో రూ.3.60 లక్షలను పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఈఈ గ్రామాల వారీగా భవన నిర్మాణ పురోగతిపై చర్చించారు. సమావేశంలో మండల ఇన్‌చార్జ్ పీఆర్ ఏఈ గంగరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాపా రాయుడు పాల్గొన్నారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

కోడుమూరు: రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తప్పవని కోడుమూరు తహసీల్దార్ జయన్న హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, బియ్యం పంపిణీ వాహనదారులతో నిర్వహించిన సమావేశంలో జయన్న మాట్లాడారు. బియ్యం పంపిణీ వాహనదారులు నెలనెలా కార్డుదారుల ఇంటి వద్దకు వెళ్లి సరుకులు అందజేయాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



లబ్ధిదారురాలికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కుల,మతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు కర్నూలు మండలం సుంకేసుల గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూలబొకేలు, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు గణాంకాలతో సహా వివరించారు. గ్రామంలో 113 వీధిలైట్లు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గడప గడపలో ప్రజల నుంచి వస్తున్న సమస్యలను సత్వరం పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అండగా నిలిచారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు పాల్గొన్నారు.